క్లుప్తంగా

మానవ హక్కుల కమిషన్ ఆవిర్భావ దినోత్సవం



తెనాలి: నేషనల్ చైర్మన్ ఆదేశాల ప్రకారం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు ఆధ్వర్యంలో గురువారం జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. బడుగు, బలహీనవర్గాలు, సామాన్య ప్రజలకు ప్రశ్నించే హక్కుల కోసం భారత ప్రభుత్వం 1993 అక్టోబరు 12న జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు రాజకీయ నేతలు, ప్రభుత్వ అధికారులు తగిన ప్రోత్సాహం ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల అత్యవసర వార్డులో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాడిబోయిన కృష్ణ, తాళ్ల కిరణ్, సభ్యులు మరియదాసు, గోపి, అశోక్, రాజేష్ పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో వృద్ధులకు దుస్తుల పంపిణీ



తెనాలి టౌన్: గాంధీనగర్‌లోని షిర్డీ సాయి వృద్ధాశ్రమంలో సీపీఐ నాయకులు చెరుకుమల్లి సింగారావు తల్లి నారాయణమ్మ జ్ఞాపకార్థ వృద్ధులకు గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నారాయణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ పాల్గొని వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. సాయిమాధవ్ మాట్లాడుతూ కమ్యూనిస్ట్ పార్టీలో నారాయణమ్మ అనేక ఉద్యమాల్లో పాల్గొని ప్రజలకు ఎన్నో సేవలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీయోగా కన్వీనర్ ఎం.రమణయ్య, సహజకవి అయినాల మల్లేశ్వరరావు, అనూష, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి స్పందన



తెనాలి అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి ఆధ్వర్యంలో నందులపేటలోని హరితా ఇంగ్లిష్ మీడియం స్కూలులో గురువారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు ధూళిపాళ్ల రవీంద్రనాథ్, డాక్టర్ చందు శివ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కన్నెగంటి వెంకట కిశోర్, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు యక్కల రామ్మోహనరావు, ఉదయ్ శంకర్, కోశాధికారి ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తా



తాడేపల్లి రూరల్: కృష్ణ, గుంటూరు జిల్లాల స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లికి చెందిన బజరంగ్ స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో సత్తా చాటారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో అకాడమీ కార్యదర్శి, కోచ్ విష్ణుమొలకల సంఘవి మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన గుంటూరు జిల్లా గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 14,17 బాక్సింగ్ పోటీలలో నలుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. సెప్టెంబర్ 29న కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహించిన అండర్- 19 బాక్సింగ్ పోటీలలో నలుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్- 19 బాలుర విభాగంలో (60 కేజీలు) మట్టపర్తి వివేక్, 52 కేజీల విభాగంలో ఎస్.కె. దావూద్ సనావుల్లా, 69 కేజీల విభాగంలో మహమ్మద్ నూరి రిహాన్‌శ్రీ, 66 కేజీల విభాగంలో చిటికెరెడ్డి హేమంత్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. అండర్- 14 బాలుర విభాగంలో (42 కేజీలు) దొంత శశాంక్ పవన్‌కుమార్, అండర్- 17 బాలికల విభాగంలో (42 కేజీలు) పట్టేడి జోన శ్రీలక్ష్మి, 60 కేజీల విభాగంలో మహమ్మద్ అఫ్రవున్నీసా, 63 కేజీల విభాగంలో పెదపాటి బేబి భవ్యశ్రీ ఎంపికయ్యారని తెలిపారు.

పేదల ఆరోగ్యానికి జగనన్న భరోసా

- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు
- మారుమూల పల్లెలకు సైతం మెరుగైన వైద్యం
- తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



హాఫ్‌పేట ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ , జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. కొల్లిపర గ్రామ సచివాలయం- 2 పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శివకుమార్, తెనాలి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. శిబిరంలో అందుతున్న వైద్యసేవలు, మందులు నాణ్యతను పరిశీలించడంతో పాటు రోగుల ఆరోగ్య పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు గ్రామాలల్లోని పేద ప్రజలకు అండగా నిలుస్తున్నాయని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. పార్టీ పరిశీలకుడు యర్రం వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పేదలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. స్పెషలిస్టు డాక్టర్లతో పేదలకు వైద్య పరీక్షలు చేయించడంతో పాటు అక్కడిక్కడే మందులు అందించేలా ఏర్పాట్లు చేశారని చెప్పారు. కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి, సంజీవరెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక , పార్టీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ దిలీప్, స్పెషలిస్ట్ డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ షేక్ కరీముల్లా, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, తహసీల్దార్ నాంచారయ్య, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

హాఫ్‌పేట శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు

తెనాలి టౌన్: ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం హాఫ్‌పేటలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ వి.సుబ్బారావు పర్యవేక్షణలో వైద్యులు దిలీప్ మన్మథకుమార్, శ్రీ రమ్య, లాస్యలు రోగులకు వైద్య పరీక్షలు జరిపారు. బీపీ, షుగర్, ఈసీజీ, రక్త పరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని ఎమ్మెల్యే శివకుమార్ సందర్శించి వైద్య సేవలు అందించే తీరును పరిశీలించారు. రోగులకు మంచి వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. తెనాలి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎం.సునీత పర్యవేక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. స్టాల్స్‌లో తినుబండారాలు, పండ్లు, తదితర వస్తువులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు ఇసుకపల్లి సుందరరావు, సర్పంచ్ తలమాల యర్రయ్య, తహసీల్దార్ కె.రవిబాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోవతోటి సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు కంచర్ల అబ్రహాం, కనపర్తి జ్యోత్స్న, దేవరపల్లి రవి, శివయ్య, అశోక్, అమరనాథ్, రుద్రపాటి రాజ్‌కుమార్, కొలకలూరు నాగేశ్వరరావు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగలకుదురుకు ఐఎస్‌వో సర్టిఫికేషన్



పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న భీతు బాలకృష్ణన్ బృందం

తెనాలి రూరల్: మండలంలోని అంగలకుదురు ప్రతిష్టాత్మక ఐఎస్‌వో 9000:2001 సర్టిఫికేషన్‌కు ఎంపికైంది. తనిఖీలో భాగంగా కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్(కిలా) నుంచి అధికారుల బృందం గురువారం గ్రామాన్ని పరిశీలించింది. ఈ బృందానికి ఐఏఎస్ అధికారిణి భీతు బాలకృష్ణన్ నేతృత్వం వహించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి పనులతో పాటు పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. మరో రెండు ఆడిట్ బృందాలు త్వరలో గ్రామాన్ని సందర్శించి పరిశీలిస్తాయని, అనంతరం పలు తనిఖీల ఆధారంగా సర్టిఫికేషన్ మంజూరవుతుందని భీతు బాలకృష్ణన్ తెలిపారు. గ్రామ స్పంచ్ యు. రాజ్యలక్ష్మి, ఎంపీడీవో ఎల్. విజయాలక్ష్మణ్, ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి గుర్రం ప్రసాదరావు బృందానికి స్వాగతం పలికారు.

ఏటా భూసార పరీక్షలతో పలు ఉపయోగాలు

లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గంగాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త గంగాదేవి

తెనాలి టౌన్: రైతులు పొలాల్లో ప్రతి ఏటా భూసార పరీక్షలు చేయించాలని, ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడాలని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గంగాదేవి సూచించారు. రూరల్ మండలం నందివెలుగు సచివాలయ ఆవరణలో గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ), వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా కేంద్రీయ విద్యాలయ పాఠశాల విద్యార్థుల ద్వారా సేకరించిన మట్టి నమూనా పరీక్షల సేకరణలో భాగంగా రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేసి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆత్మ ప్రాజెక్టు ఉప వ్యవసాయ సంచాలకులు పి.రామాంజనేయులు అధ్యక్షత వహించారు. సదస్సులో శాస్త్రవేత్త గంగాదేవి మాట్లాడుతూ దుక్కిలో సూపర్ ఫాస్ఫేట్ వేయాలని రైతులకు సూచించారు. కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలని తెలిపారు. వ్యవసాయశాఖ కార్యాలయ జాయింట్ డైరెక్టర్ పద్మజ మాట్లాడుతూ భూమి ఆరోగ్యంగా ఉండే విధంగా చూడాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పొలాల్లో 35శాతం జింక్ లోపం ఉన్న భూముల్ని గుర్తించామన్నారు. రెండు పంటల్లో ఒకసారి 20 కిలోల జింక్ వేయడంతో పాటు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. బీడీఏ రత్నమంజుల మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో 10 కేంద్రీయ విద్యాలయాలు, 10 నవోదయ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు మట్టి పరీక్షలు నమూనాలు సేకరిస్తున్నారని తెలిపారు. వాటికి ల్యాబ్‌లో పరీక్షలు చేసి రైతులకు ఎరువులు వాడే వాడకం గురించి తెలియజేస్తారని చెప్పారు. తెనాలి కేంద్రీయ విద్యాలయం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందని తెలిపారు. అధ్యక్షత వహించిన రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు తెనాలి మండలం నందివెలుగు, గుడివాడ గ్రామాల్లోని రైతుల పొలాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులతో కలసి 52 మట్టి నమూనాల యాప్ ద్వారా సేకరించారని తెలిపారు. సాయిల్ టెస్టింగ్ కిట్ (మినీ ల్యాబ్) ద్వారా విద్యార్థులే స్వయంగా వాటిని విశ్లేషించినట్లు చెప్పారు. సదస్సు ద్వారా రైతులను నేరుగా కలుసుకుని వారికి తాము తయారు చేసిన నమూనాల ఫలితాలను అధికారులతో కలసి రైతులకు అందజేశారు. గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్ మాట్లాడుతూ అధికారుల సిఫారసు మేరకు ఎరువులు వాడినట్లయితే పొలాలు బాగుంటాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు శివగగన్, యశస్వీలు తమ అనుభవాలు, పొలాల్లో తాము నేర్చుకున్న విషయాలను రైతులతో పంచుకున్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ వేసవిలో పొలాల్లో పచ్చిరొట్ట పైరులు పెంచి, కలియదున్నాలని సూచించారు. రైతులకు సర్పంచ్ పవన్‌కుమార్, శాస్త్రవేత్త గంగాదేవి, జాయింట్ డైరెక్టర్ పద్మజ సాయిల్ టెస్టింగ్ కార్డులను అందజేశారు. సదస్సులో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, తెనాలి ఏడీఏ ఎన్.ఉషారాణి, ఏవో జి.ప్రేమ్ సాగర్, కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, రామిరెడ్డి, డీఆర్‌సీ రాజవంశీ, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఏఈవో సౌజన్య, ఏఈవో మోహన్, వీఏఏ మౌనిక, పంచాయతీ కార్యదర్శి జి.సుభాష్ చంద్రబోస్, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచిపేరు తేవాలి

వలంటీర్ల సమావేశంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



నూతనంగా ఎన్నికైన వలంటీర్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: బాధ్యతతో పనిచేస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. ఇటీవల నూతనంగా నియమించిన వార్డు వలంటీర్లకు గురువారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల్ని ప్రజల్లోకి తీసుకువెళ్తూ వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం 25మందికి నియామక పత్రాలు అందజేశారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ మంజూరు పత్రాల్ని అందజేశారు. కమిషనర్ ఎం.జశ్వంతరావు, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, తాడిబోయిన రామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కుక్కల ముక్తేశ్వరరావు, తాడిబోయిన రమేష్, అక్కిదాసు కిరణ్, మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి

కొల్లిపర: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, తెనాలి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పార్టీ పరిశీలకులు యర్రం వెంకటేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేరి మట్టి.. మేరి దేశ్ కార్యక్రమంలో భాగంగా అజాజీదా అమృత్ మహోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించారని, విద్యార్థులు వాటిని తప్పక తెలుసుకుని వారి అడుగుజాడలో నడవాలని సూచించారు. తొలుత మండలంలోని వివిధ గ్రామాల నుంచి తీసుకువచ్చిన మట్టిని ఎమ్మెల్యే శివకుమార్, తెనాలి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పార్టీ పరిశీలకులు యర్రం వెంకటేశ్వర రెడ్డితో కలసి ఒక కలశంలో నింపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు నాంచారయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి ఈయూ కృషి



నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు, హనుమంతరావు

తెనాలి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) ఎంతో కృషి చేస్తోందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ డిపోలో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పలు సంఘాల నుంచి ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ జెఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఆర్టీసీ ఏండీ ద్వారక తిరుమలరావు సహకారంతో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం డిపో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.బాబు, కార్యదర్శిగా ఎం.సుధాకరరావు, గౌరవాధ్యక్షుడిగా పి.వీరయ్యబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.మనోజ్ కుమార్, గ్యారేజ్ అధ్యక్షుడిగా డీడీఎస్.రావు, కార్యదర్శిగా వి.జోషిబాబును ఎన్నుకున్నట్లు చెప్పారు. గుంటూరు జిల్లా కార్యదర్శిగా ఈపూరి విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్, సీనియర్ నాయకులు ఎం.హనుమంతరావు, కె.ఎ స్.కరీముల్లా, యలమంద, అంజలీదేవి, ఐ.వి.రాజేష్‌ఖన్నా, డి.వి.స్వామిఖన్నా, నాగయ్య, కాశీం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భట్టిప్రోలు: బైక్‌పై వెళుతున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభానికి ఢీకొని మృతి చెందిన సంఘటన ఇది. భట్టిప్రోలు పోలీసుల కథనం ప్రకారం.. రేపల్లెని ఓ రెస్టారెంట్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న తాళ్లూరి అరుణ్ (29) బాబాయి ఉంటున్న తెనాలికి బుధవారం రాత్రి బైక్‌పై బయలుదేరాడు. భట్టిప్రోలు మండలం గొరిగపూడి దాటగానే బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. తీవ్ర గాయాలతో ఉన్న అరుణ్‌ను గుర్తించి అటుగా వెళుతున్న ఓ లారీ డ్రైవర్ ఒంటిగంట సమయంలో 108కు కాల్ చేసి సమాచారం అందించారు. సమాచారం మేరకు అతడిని తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఇతడు సంగారెడ్డి జిల్లా కోంపల్లి గ్రామం సాయిబాబానగర్‌కు చెందిన వాసి. అవివాహితుడని తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక విద్యార్థుల ఎంపిక



జిల్లా కోచ్‌లతో పతకాలు సాధించిన విద్యార్థులు

తెనాలి టౌన్: రాష్ట్రస్థాయి పెన్సింగ్ పోటీలకు రూరల్ మండలం కొలకలూరులోని జూబ్లీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ లీమా గురువారం తెలిపారు. గుంటూరులోని బ్రహ్మానంద రెడ్డి స్టేడియంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో జూబ్లీ స్కూల్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థి వి.వినయ్‌కుమార్ బంగారు, కోట అఖిల్ వెండి పతకాన్ని సాధించినట్లు స్కూల్ ఫిజికల్ డైరెక్టర్లు రవికుమార్, ఆదిత్య తెలిపారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పెన్షింగ్ పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థుల్ని ప్రిన్సిపాల్ సిస్టర్ లీమా, కరస్పాండెంట్ కరోలినా, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న బూర్లె నరసింహారావు, కమిటీ సభ్యులు

తెనాలి: దసరా పర్వదినం సందర్భంగా పట్టణంలోని బోసు రోడ్డులో ప్రసిద్ధి చెందిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈనెల 15నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 23వరకు జరిగే ఉత్సవాల బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఉత్సవాల వివరాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, కార్యదర్శి బూర్లె నరసింహారావు, కార్యవర్గ సభ్యులు వుప్పల వరదరాజులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రతిరోజూ శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు, శ్రీరాజరాజేశ్వరీదేవి ప్రత్యేక అలంకారాలతో భక్తులకు కనువిందు చేయనున్నట్లు నరసింహారావు చెప్పారు. నవచండీ పారాయణ-హోమం ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు ఆలయంలోని విజయగణపతి, రాహుకేతువులు, నవగ్రహాలు, శ్రీవింధ్యవాసినీ సమేత నగరేశ్వరస్వామి, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి అభిషేకాలు, పూజలు, హోమాలు జరుగుతాయని చెప్పారు. ప్రతిరోజూ జరిగే పూజల వివరాల్ని నుదురుపాటి రామకోటేశ్వరశర్మ తెలియజేశారు. కమిటీ కార్యవర్గ సభ్యుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, శశి గ్రూప్ అధినేత, కార్యవర్గసభ్యుడు వుప్పల వరదరాజులు మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాల్లో శోభాయమానంగా దర్శనమిచ్చే అమ్మవార్లను తెనాలి, పరిసరాల్లోని భక్తులు సందర్శించి ఆమె కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ కార్యవర్గసభ్యులు మద్దాళి శేషాచలం, అత్తలూరి నరసింహారావు, గొడవర్తి సాయి హరేరామ్, నూకల వెంకట భాస్కరరావు, కొణిజేటి శంకరరావు, గోపు రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు



తనిఖీల అనంతరం అధికారులతో సమీక్ష చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసబాబు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగాల ఆధ్వర్యంలో గుంటూరు డీ-10 సెక్షన్ పరిధిలోని పలు కాలనీల్లో గురువారం అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సాయిబాబా కాలనీ, పొన్నూరు రోడ్డు, బుడంపాడు ప్రాంతాల్లో 56 మంది అధికారులు, 158 మంది సిబ్బంది 56 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. 4,028 సర్వీసులను పరిశీలించారు. అనుమతులు లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 266 మందికి రూ. 15.25 లక్షలు, అనుమతించిన కేటగిరి కాకుండా, ఇతర విభాగాల్లో విద్యుత్ వాడుతున్న ఐదుగురికి రూ.1.50 లక్షల అపరాధ రుసుం విధించారు. అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 261 మందికి రూ. 13.75 లక్షల అపరాధ రుసుం విధించారు. దాడుల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు టి.శ్రీనివాసబాబు, కె.సూర్యప్రకాష్, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎం.రవికుమార్, కె.రవికుమార్, ముస్తాక్ అహ్మద్, ఏఈలు కోటేశ్వరరావు, దేవదాస్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఉద్యోగులకు చార్జ్ మెమోలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులకు కమిషనర్ కీర్తి చేకూరి చార్జ్ మెమోలు జారీ చేశారు. సుద్దపల్లి డొంకలో 750 గజాల స్థలానికి ఇద్దరు హక్కుదారులు మధ్య వివాదాలు జరుగుతున్నాయి. అయితే, ఇందులో ఒకరు సదరు స్థలం పన్నులతో పాటు అక్కడ ఉన్న భవనాన్ని తొలగించాలని హైకోర్టును ఆశ్రయించారు. ఆయనకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో పాటు హక్కుదారుడు కాని వారికి పన్ను పేరు ఏ విధంగా మార్చారంటూ కోర్టు ప్రశ్నించింది. దీనిపై స్వయంగా వచ్చి సమాధానం చెప్పాలని నగర కమిషనర్‌కు సమన్లు జారీ చేయడంతో పది రోజుల కిందట ఇద్దరూ హాజరయ్యారు. దీనిపై నగర కమిషనర్ కీర్తి చేకూరి, గతంలో ఆర్వోగా పని చేసి ప్రస్తుతం సీడీఎంఏ కార్యాలయంలో పని చేస్తున్న వేణుకు, ఆర్ఐ హయత్‌షా వలిలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వాటికి సరైన సమాధానం రాకపోవడంతో బుధవారం రాత్రి ఇద్దరికి చార్జ్ మెమోలు జారీ చేశారు.

ఉద్యోగం రాలేదని మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

తెనాలి రూరల్: ఉద్యోగం రాలేదని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని చెంచుపేటకు చెందిన వి. గంగాధరరావు(22) గురువారం ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐటీఐ చదివిన అతను ఉద్యోగం రావడంలేదని మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబసభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు.

చుక్కపల్లివారి పాలెంలో పాఠశాల ప్రారంభం



పాఠశాలను ప్రారంభిస్తున్న సర్పంచి దాసరి సుందరమ్మ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చుక్కపల్లివారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సర్పంచి దాసరి సుందరమ్మ గురువారం ప్రారంభించారు. ఎంపీపీ డి.సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు డి.అరుణ హాజరై మాట్లాడుతూ గతంలో షాల్మేష్ ఆర్మీ ఎయిడెడ్ పాఠశాల ఉండేదని దానిని మూసివేశారని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి పాఠశాల ఏర్పాటుకు కృషి చేసినట్లు చెప్పారు. గతంలో ఉన్న షాల్మేష్ ఆర్మీ ఎయిడెడ్ పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించి 1వ తరగతి నుంచి ఐదో తరగతి వరకు పునః ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం ఒక టీచర్‌ను కేటాయించిందని, త్వరలోనే మరొకరిని కేటాయించనున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీవో కుసుమ శ్రీదేవి, ఎంఈఓలు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, దుగ్గిరాల వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్.రత్నం, రజనీకాంత్, వెంకటేశ్వరరావు, వీరయ్య, రమేష్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అత్యుత్సాహం

మంగళగిరి: పట్టణంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి(శివాలయం)లో గురువారం బీజేపీ నాయకులు హడావుడి చేశారు. శివాలయంలో గత కొద్ది రోజులుగా రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గర్భ గుడిలో పనులు జరుగుతుండడంతో శివుని విగ్రహం మీద దుమ్ము ధూళి పడకుండా అర్చకులు స్వామి వారు కనిపించకుండా ముసుగు వేశారు. ఇది తెలుసుకున్న బీజేపీ నాయకులు పనులు జరుగుతున్నాయనే ఆలోచన లేకుండా ఆలయానికి వచ్చి అర్చకులపై జులుం ప్రదర్శించారు. ప్రధాన అర్చకుడి దుర్భాషలాడుతూ ఉద్యోగం తీసేయిస్తామని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బెదిరింపులకు దిగడంతో పాటు ఇన్‌చార్జి ఈవో ఏ. రామకోటిరెడ్డి చెప్పినా వినకుండా ఆందోళనకు దిగడం భక్తులతో నగర ప్రజలను విస్తుపోయేలా చేసింది. దీనిపై ఆలయ ఈవో రామకోటిరెడ్డి మాట్లాడుతూ ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిలిపివేసినట్లు చెప్పారు. స్వామికి ఎక్కడా అపచారం జరగలేదని ఆయన స్పష్టం చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com